ఈనాడు
కుమురం భీం
మంగళవారం అక్టోబరు 15, 2024

మైదానంలా అడవి.. చర్యలు తీసుకోరేమి?

● '236 చెట్ల నరికివేత' విచారణలో గోప్యత

అడవిలో వనమేధం కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. పోడు పేరుతో వందలాది చెట్లు నేలకొరిగినా, మొక్కుబడిగా విచారణ చేపట్టి చేతులు దులుపుకొన్నారే తప్ప విధులపై నిర్లక్ష్యం వహించిన వారిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వాస్తవంగా జిల్లా వ్యాప్తంగా వృక్షాల నరికివేత విచ్చలవిడిగా సాగుతోంది. పట్టణాలకే పరిమితమైన అటవీ అధికారులు కలప అక్రమ రవాణాను అరికట్టడంలో విఫలమవుతున్నట్లుగా అటవీ ప్రాంతాల్లో నరికేసిన చెట్ల అడుగు భాగాలు స్పష్టం చేస్తున్నాయి.


చింతలమానేపల్లి మండలం బండపల్లి ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో చెట్లు నరికివేశారిలా..

ఈనాడు, ఆసిఫాబాద్

ఏటా పోడు పేరుతో వన విలాపం కొనసాగుతుండగా, మరోవైపు స్మగ్లర్లు సైతం అడవిని అంతం చేస్తున్నారు. తాజాగా చింతలమానేపల్లి మండలంలో చోటుచేసుకున్న ఉదంతం అటవీ అధికారుల ఉదాసీన వైఖరిని చాటుతోంది. కర్జెల్లి సెక్షన్‌లోని బండపల్లి బీట్ అటవీ ప్రాంతంలో 236 చెట్లు నరికివేతకు గురయ్యాయి. ఇందులో టేకుతోపాటు, అనేక వృక్షాలు ఉన్నాయి. సమాచారం రావడంతో కాగజ్‌నగర్ ఎఫ్‌ఆర్‌ఓ ఆధ్వర్యంలో పక్షం రోజుల కిందట విచారణ చేశారు. నరికివేసిన ఎనిమిది మందిని ఎఫ్‌డీఓ గుర్తించగా.. అక్కడి అధికారులు కేవలం ఆరుగురిపైనే కేసులు నమోదు చేశారు. ఇద్దరిని తప్పించడంలో భారీ స్థాయిలో నగదు చేతులు మారినట్లుగా, అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లుగా విచారణ సందర్భంగా అధికారులు గుర్తించారు. నరికిన చెట్లకు సంబంధించిన దుంగలు సైతం మాయమైనట్లుగా వీటి సొమ్మును సైతం జేబులో వేసుకున్నట్లుగా తెలుస్తోంది.

అంతా అవినీతిమయం...

236 చెట్లతో నిండిన వనం మైదానంలా మారినా అటవీ అధికారులు చూసీ చూడనట్లుగానే ఉన్నారు. చెట్ల నరికివేత, విత్తనాలు వేసి పోడు చేయడం తదితర అంశాలన్నీ వెలుగుచూసినా, అక్రమార్కులకు పలువురు ఉన్నతాధికారులు అభయమిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారని సమాచారం. విచ్చలవిడిగా చెట్లను నరికి పోడు చేస్తున్న వారిని గుర్తించి ఎంతో కొంత తీసుకుని కొందరు అటవీ అధికారులు వదిలేయడం జిల్లాలో పరిపాటిగా మారుతోంది. తిర్యాణి మండలంలోని ఎర్రబండ, తాటిగూడ, మంగీ, గుండాల, గోవెన నాయకపుగూడ, లింగాపూర్ మండలంలోని ఖిమ్మనాయక్ తండా, చింతలమానేపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ మండలాల్లో చెట్ల నరికివేత నిరంతరం సాగుతోంది.

అనేక ప్రశ్నలు..

డీఎఫ్‌ఓ నీరజ్‌కుమార్ సోమవారం తిర్యాణి మండలంలోని గిన్నెధరి అటవీ ప్రాంతంలో పర్యటించారు. కొన్ని చెట్లు నరికివేసి ఉండడాన్ని గమనించి సంబంధిత బీట్ అధికారిని సస్పెండ్ చేయడానికి సన్నద్ధమయ్యారు. చెట్లు రెండేళ్ల కిందట నరికేశారని సదరు అధికారి సర్దిచెప్పడంతో సస్పెండ్ చేయకుండా చివరి నిమిషంలో ఆగినట్లుగా తెలిసింది. అయితే 236 చెట్లు నెల కిందట నరికిన వారిపై చర్యలు ఎందుకు లేవనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

జిల్లాలో అటవీ విస్తీర్ణం:	పోడు పట్టాలు:	పోడు సాగుతున్న భూములు:	ఆక్రమణలు:
2,44,540 హెక్టార్లు	35 వేల ఎకరాలు	దాదాపు లక్ష ఎకరాలు	55 వేల ఎకరాలు


భీంపూర్‌లో పత్తి చేను చుట్టూ వల ఏర్పాటు చేసుకున్న రైతు

రక్షణ వల.. చక్కటి ఆలోచన!

తిర్యాణి మండలంలోని చాలా వరకు పంట చేన్లు అటవీ ప్రాంతానికి దగ్గర ఉండటంతో.. వన్యప్రాణుల బెడద తీవ్రంగా ఉంటోంది. పత్తి పంట ప్రస్తుతం పూత, కాయ దశలో ఉండటంతో.. రాత్రి వేళల్లో అడవి పందులు గుంపులుగా వచ్చి చెట్లను ధ్వంసం చేసి కాయలను తింటూ నాశనం చేస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు వివిధ రకాల చర్యలు చేపడుతున్నారు. చేన్ల చుట్టూ చీరలు, సౌర కంచెలు ఏర్పాటు చేసుకుని రాత్రివేళల్లో అక్కడే నిద్రిస్తున్నారు. భీంపూర్ గ్రామ రైతులు నైలాన్ వల కొనుగోలు చేసి ఇలా పత్తి చేను చుట్టూ ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా కొంతమేర ఇబ్బందులు తప్పాయని చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, తిర్యాణి

నియామకాలు చకచకా.. బడులకు కొత్త కళ

● నేడు కౌన్సెలింగ్.. రేపు విధుల్లో చేరిక

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

ఉపాధ్యాయుల నియామకాల ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన, సీఎం చేతులమీదుగా నియామక పత్రాల అందజేత, మరునాడే విధుల్లో చేరిన వారికి.. ఈ నెల 15న పోస్టింగుల కోసం ప్రత్యక్ష కౌన్సెలింగ్, 16న కోరుకున్న పాఠశాలల్లో చేరే కార్యాచరణ ప్రకటించింది. జిల్లాలో 270 మంది కొత్త ఉపాధ్యాయుల హాజరుతో ఈ నెల 16న పాఠశాలలు కొత్త కళను సంతరించుకోనున్నాయి.

ప్రభుత్వం డీఎస్సీ పరీక్ష అనంతరం 61 రోజుల్లోనే ఫలితాలు ప్రకటించింది. ఈ నెల 2-5 వరకు 1:3లో ధ్రువపత్రాలను పరిశీలించి 8వ తేదీన అభ్యర్థులను ఎంపికచేసింది. 9న సమయంలో ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు తరలించి ముఖ్యమంత్రి చేతులమీదుగా నియామక పత్రాలను అందజేశారు. 10న నియామక పత్రాలు అందుకున్న 176 మంది ఎస్జీటీలు, 94 మంది స్కూల్ అసిస్టెంట్లు డీఈవో కార్యాలయాల్లో విధుల్లో చేరిపోయారు. అదే రోజు నుంచే వారి సర్వీసు లెక్కలోకి వచ్చినట్లు విద్యాశాఖ ప్రకటించగా.. వేతనం కూడా అప్పటి నుంచే లెక్కగట్టనున్నట్లు పేర్కొంది.

రేషనలైజేషన్ నిబంధనల మేరకే..

జిల్లాలో.. ప్రభుత్వ, స్థానిక సంస్థల అన్ని మాధ్యమాలు కలిపి 140 ఎస్ఏలు, 366 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరితోపాటు ఇటీవల పదోన్నతుల ద్వారా, పదవీ విరమణల ద్వారా ఖాళీ అయిన పోస్టులు కూడా ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఎంపికైన వారి సంఖ్యకు సరిపడే 270 ఖాళీలను మాత్రమే ప్రదర్శించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వీటిని కూడా రేషనలైజేషన్ నిబంధనల మేరకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎక్కడ ఉపాధ్యాయుడి అవసరం ఉందో గుర్తించి దాన్ని మాత్రమే కౌన్సెలింగ్ కోసం ఖాళీగా చూపనున్నారు. దీంతో అభ్యర్థులు ఖాళీలను ఆరాతీస్తున్నప్పటికీ విద్యార్థుల సంఖ్య ఆధారంగా చూపించే పోస్టులను గుర్తించలేక ఉత్కంఠకు లోనవుతున్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కొత్తవారికి సీనియర్ల ఆహ్వానం

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు తాము కోరుకున్న పాఠశాలకు వెళ్లిపోవచ్చని ఇదివరకే బదిలీ అయి రిలీవర్ లేని కారణంగా నిరీక్షణలో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు ఆశపడుతున్నారు. జిల్లాలో ఇలా రిలీవ్ కాకుండా 294 మంది సీనియర్లు ఉన్నారు. దాదాపుగా వీరంతా ఎస్జీటీలే. వీరంతా తమ స్థానాలను కొత్త ఉపాధ్యాయులు కోరుకోవాలని ఉబలాటపడుతున్నారు. కౌన్సెలింగ్‌లో ఈ స్థానాలను చూపించే అవకాశాలున్నాయని విద్యాశాఖాధికారి ఒకరు తెలిపారు.

ఖాళీలపై ఆరా..

ఖాళీలు ఎక్కడెక్కడ ఉన్నాయి.. పాఠశాలలు ఎంత దూరంలో ఉన్నాయి. అక్కడ విద్యార్థులు, పరిస్థితులు ఆరాతీయడంలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. జిల్లాలో అన్ని విషయాల స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ), ఎస్జీటీలు కలిపి 341 పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిలో 102 ఎస్ఏలు కాగా 249 ఎస్జీటీలు. అయితే 94 ఎస్ఏలు, 176 ఎస్జీటీ పోస్టులకు డీఎస్సీ నియామకమయ్యారు.




డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన వారితో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్, తదితరులు

కొండా లక్ష్మణ్ స్మారక వసతి గృహం ఏర్పాటుకు కృషి : ఎంపీ

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆదర్శనగర్‌లో రెండు ఎకరాల స్థలంలో కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారక వసతిగృహం ఏర్పాటుకు కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పేర్కొన్నారు. పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి భవన్‌లో సోమవారం నిర్వహించిన ఆత్మీయ ఆలింగన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దసరా పురస్కరించుకుని అలాయ్ బలాయ్ వేడుక నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వసతిగృహాల్లో చేనేత వస్త్రాలు అందించేలా చూస్తామని, సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సత్కారం..

ఇటీవలి డీఎస్సీలో పద్మశాలి కులస్థులు ఉద్యోగాలు సాధించి సత్తా చాటడం అభినందనీయమని భారాస రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన సీహెచ్ సుమిత, గుండు సింధూజ, జంజిరాల అహల్య, బూర భారతి, సిరిపురం ప్రియాంక, మంచికట్ల మానస, ఇప్ప ప్రియాంక, కొప్పుల రాజ్‌కిరణ్, మంచికట్ల మహేందర్, చెన్నూరి రాజేంద్రప్రసాద్ తదితరులను ఎంపీ, ఎమ్మెల్యే హరీశ్, భారాస నాయకుడు ప్రవీణ్‌కుమార్, కాగజ్‌నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్‌లు. శాలువాలతో సత్కరించి అభినందించారు. పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుడిక్యాల రాజమౌళి, అనుమాండ్ల కేదారీ, నాయకులు నల్ల కనకయ్య, సిందం చంద్రయ్య, సామల రాజయ్య, కొంగ సత్యనారాయణ, సిందం శ్రీనివాస్, గడదాసు మల్లయ్య, మామిడాల తిరుపతి, కటుకం మధూకర్, మామిడాల మమత, గడ్డం భిక్షపతి, మాచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అపోహలు వీడేలా.. చెల్లుబాటయ్యేలా

● పది నాణెంపై బ్యాంకు సిబ్బంది ప్రచారం

న్యూస్‌టుడే, లక్సెట్టిపేట

పది రూపాయల నాణెం చెల్లుబాటుపై ప్రజల్లో ఉన్న అపోహను తొలగించి వాటిని అన్ని వర్గాలతో వాడకంలోకి తెచ్చేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అటు దుకాణ దారులు, ఇటు వినియోగదారులకు నమ్మకాన్ని కలిగించి వాటి చలామణి పెంచేందుకు వీలుగా ప్రచారాన్ని ప్రారంభించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో నాణేల చట్టబద్ధతపై విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టింది.


లక్సెట్టిపేటలో దుకాణదారులకు పది రూపాయల నాణేలు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది.

చిల్లర డబ్బుల కొరత

చిల్లర డబ్బుల చలామణి మామూలుగా కూరగాయల మార్కెట్లు, చిరు వ్యాపారులు, పాన్ దుకాణాలు, చిన్న చిన్న హోటళ్లు, కిరాణా దుకాణాల్లో ఎక్కువగా సాగుతాయి. పది రూపాయల నాణేలు చెల్లుబాటు కావన్న అపోహ ప్రజల్లో బలంగా నాటుకుపోయిన కారణంగా అక్కడ కూడా తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో చిరిగిన, నలిగిపోయిన నోట్లు తీసుకుంటున్నారు తప్ప వీటిని తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. దీంతో మార్కెట్లో చిల్లర డబ్బుల కొరత తీవ్రంగా మారింది.



ఇదీ సమస్య

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా పది రూపాయల నాణేలను 2005లో తొలిసారిగా ముద్రించింది. 2019 వరకు ఆయా సందర్భాలను బట్టి 14 సార్లు ఇవి విడుదలయ్యాయి. అన్ని రకాల నాణేలు చెల్లుబాటులో అవుతాయని రిజర్వు బ్యాంకు పలుమార్లు స్పష్టం చేసినా వాటి చలామణి దాదాపు నిలిచిపోయింది. అవగాహన ఉన్న కొందరు వాటిని వాడుదామనుకున్నా ఎదుటి వ్యక్తులు వాటిని తీసుకోవడానికి నిరాకరించడంతో బహిరంగ మార్కెట్‌లో వాడకం నిలిచిపోయింది. పది రూపాయల నోట్లు మార్కెట్లో ఉన్నప్పటికీ చేతులు మారేకొద్దీ అవి చినిగి పనికి రాకుండా పోతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని రిజర్వు బ్యాంకు పది రూపాయల నాణేలు ముద్రిస్తున్నా వాటి చలామణి నిలిచిపోవడం సమస్యగా మారింది.

ఏం చేస్తున్నారంటే...

బ్యాంకు పరిధిలోని మార్కెట్లు, దుకాణాలు, రైతు బజార్‌లు, ప్రధాన మంత్రి స్వనిధి లబ్ధిదారులను కలిసి వారికి పది రూపాయల నాణెం చలామణికి సంబంధించి చట్టబద్ధతపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ నెల 15వ తేదీన కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బ్యాంకు సిబ్బంది తమ కరెన్సీ చెస్ట్ నుంచి కనీసం పది నాణేలు తీసుకుని వాటిని అన్ని వర్గాలకు పంపిణీ చేసి చలామణిలోకి తీసుకొచ్చేలా ప్రచారం చేస్తున్నారు. తర్వాత రోజుల్లో బ్యాంకు సిబ్బంది లావాదేవీల సందర్భంగా ప్రతి వినియోగదారుడికి నగదు చెల్లింపుల సందర్భంగా నిర్ణీత మొత్తంలో నాణేలు అందజేయనున్నారు. దీంతో మార్కెట్‌లో చిల్లర సమస్య తొలగనుంది.

తీసుకోవడానికి నిరాకరిస్తే చర్యలు

పది రూపాయల నాణేలు చెల్లుబాటు కావనేది అపోహ మాత్రమే. గతంలో పలుమార్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నాణేల చట్టబద్ధతపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఎవరైనా పది రూపాయల నాణేలు తీసుకోవడానికి నిరాకరిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు.

- బిశ్వనాథ్ బోయ్, బ్రాంచి మేనేజర్, యూనియన్ బ్యాంకు, లక్సెట్టిపేట

విషజ్వరంతో ఏఎస్సై మృత్యువాత

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ గ్రామీణ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఇర్ఫాన్‌నగర్‌కు చెందిన గులాం మసూద్ అహ్మద్(52) విషజ్వరంతో మృత్యువాతపడ్డారు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కొన్ని రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందారు. ఇటీవలే ఆయన హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైగా పదోన్నతి పొందారు. మండలంలోని నాగంపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని జంబుగ ఆయన సొంత గ్రామం. ఈ సందర్భంగా ఆయన పార్థివ దేహానికి కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, పలువురు పోలీసు అధికారులు నివాళుర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



ఏఎస్సై మసూద్ అహ్మద్ పార్థివదేహంపై పూలమాల వేస్తున్న డీఎస్పీ రామానుజం


మసూద్ అహ్మద్

క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఆరా తీసి

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను జాతీయ స్థాయి బృందం సోమవారం పరిశీలించింది. మండలంలోని దుర్గానగర్, కోసిని గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను బృంద సభ్యులు నాగరాజు, రఘునాథన్ పరిశీలించారు. విలేజి నెం.9లోని అమూల్‌పాల్ అనే రైతు చేనులో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన చేపల చెరువును పరిశీలించిన బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఇదే గ్రామంలోని స్వయం సహాయక సంఘాలను కలిసిన సభ్యులు ఫించన్ల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. కోసిని పంచాయతీ కేంద్రంలోని సంపద వనాలను పరిశీలించి, స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీడీఓ రమేష్, ఏపీఓ బుచ్చన్న, ఏపీఎం భూమక్క, సాంకేతిక సహాయకులు దేవేంద్ర, శ్రావణ్, రమాదేవి, కిశోర్, పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, రజిత, క్షేత్ర సహాయకులు సుమిత్, గురువయ్య, పోశెట్టి తదితరులున్నారు.


చేపల చెరువు పరిశీలిస్తున్న జాతీయ స్థాయి బృంద సభ్యులు



బేల మండలం ఇంద్రానగర్‌కు చెందిన ఇతడి పేరు సిరాజ్. వేసవిలో భార్యతోపాటు చేసిన కూలీ పనికి వచ్చిన రూ.12 వేల డబ్బులు అధికారులు చెల్లించటం లేదు. ఇతడిలా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని పేదల గోడును అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమాలను సైతం పారదర్శకంగా ఉన్నట్లు నమ్మించటంలో సిద్ధహస్తులైన కొంత మంది అధికారులు, సిబ్బంది కారణంగా పనుల నిర్వహణ అంతా ఆగమాగంగా ఉంది. రోజు కూలీ రూ.300 దక్కేలా పనులు చూపించాల్సి ఉంది. నిర్మల్ జిల్లాలో సగటు కూలీ రూ.218, ఆదిలాబాద్ జిల్లాలో రూ.238కే పరిమితం చేయటం కూలీల పాలిట శాపంగా మారుతోంది.


◆ ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోకారి, అంకోలి గ్రామాల శివారులో కాకుండా 5 కి.మీ దూరంలో పనులు చూపించిన విషయం జిల్లా అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు దృష్టికి వచ్చినప్పటికీ పట్టించుకోలేదు. పని కావాలని మొరపెట్టుకున్నా.. కూలీల గోడు వినలేదు.

ఇచ్చి 'పుచ్చుకుంటున్నారు'

● సామాజిక తనిఖీల్లో వెలుగు చూడని అవినీతి తతంగం

ఈటీవీ ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు గాడి తప్పుతోంది. అధికారుల పర్యవేక్షణలోపంతో పనుల నిర్వహణ అక్రమాలకు దారి తీస్తోంది. జిల్లాకు ప్రత్యేకంగా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి(అడిషనల్ డీఆర్‌డీవో) ఉన్నప్పటికీ పనుల నిర్వహణలో పారదర్శకత కనిపించటం లేదు. పైగా కొంతమంది అధికారులు సామాజిక తనిఖీల్లో బయట పడకుండా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరిస్తుండటంతో ఈ అవినీతి తతంగం వెలుగు చూడటం లేదు. ఫలితంగా క్షేత్రస్థాయిలో జరిగే విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి రావటం లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఒక్కొక్కరికి రోజు కూలీ రూ.300 నిర్ణయించినప్పటికీ రూ. 250 దాటలేదు.



ఆదివాసీలకు అన్యాయం

ఆసిఫాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న అక్రమాలు బయటకు పొక్కకుండా క్షేత్రస్థాయిలో సర్దుబాటు చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొంత మంది సిబ్బంది బినామీ వ్యక్తుల పేరిట లబ్ధి పొందే దందా సాగుతోంది. ఇటీవల ఆసిఫాబాద్ మండలంలో 27 పంచాయతీలు ఉంటే 19 పంచాయతీల పరిధిలోని పనుల్లో రూ.3,68,900 నిధులు దుర్వినియోగం అయినట్లు తేలింది. జిల్లాలోని 15 మండలాల్లోని 335 పంచాయతీల పరిధిలోని అక్రమాలను సర్దుబాటు చేసే ప్రయత్నం జరుగుతోంది. కూలీల్లో అత్యధికులు ఆదివాసీలే కావటంతో అధికారులు చెల్లించిందే వేతనం అన్నట్లు నమ్మించే ప్రయత్నం జరుగుతోంది.

మంచిర్యాలలో ఇలా..

మంచిర్యాల జిల్లాలో కూలీలకు పనులు చూపించడానికంటే నేతల సిఫారసులకే అధికారులు ప్రాధాన్యమిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. సింగరేణి ప్రాంతమైనందున కూలీ పనులకు గ్రామీణులు ముందుకురారని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవటం అధికారులకు కలిసి వస్తోంది. కోటపల్లి మండలంలోని 31 పంచాయతీల్లో రూ.5.01 కోట్ల పనులు జరిగితే రూ.4.84 కోట్ల చెల్లింపులు జరిగినట్లు తేలింది. మరో రూ.17,72,917 తేడాలున్నట్లు దృష్టికిరాగా రూ.26,116 రికవరీకి ఆదేశించారు. చెన్నూరు మండలంలోని 30 పంచాయతీల పరిధిలో దుర్వినియోగమైన రూ.51 వేలు రాబట్టినట్లు నివేదికలు తయారు చేయటం అధికారుల పనితనాన్ని వెల్లడిస్తోంది.

జిల్లాల వారీగా వివరాలు.. (■ మండలాలు ■ పంచాయతీలు)

జిల్లా	మండలాలు	పంచాయతీలు
ఆదిలాబాద్	17	473
నిర్మల్	18	400
ఆసిఫాబాద్	15	335
మంచిర్యాల	16	311

నిర్ణీత సమయానికి హాజరుకావాలి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో డీఎస్సీ-2024కు ఎంపికై నియామక ఉత్తర్వులు అందుకొన్న అభ్యర్థులు మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే పాఠశాల పోస్టింగుల ప్రత్యక్ష కౌన్సెలింగ్‌కు విధిగా హాజరు కావాలని డీఈఓ ఎస్.యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత సమయానికి నియామక ఉత్తర్వులు, ర్యాంక్ కార్డు, రెండు పాస్ ఫొటోలతో తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు.



సస్యరక్షణతోనే దిగుబడి..

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే:

ప్రస్తుతం వరిలో కలుపు పనులు పూర్తయ్యాయి. ముందుగా నాటు వేసిన చోట గొలకలు వేస్తున్నాయి. కర్ర గట్టిపడుతోంది. ఈ సమయంలోనే పంటలు కాపాడుకోవడం ఎంతో కీలకం. పంటను ఏమాత్రం అశ్రద్ధ చేసినా దిగుబడి తగ్గే ప్రమాదముంది. అయితే పంట చేతికొచ్చే వేళ వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల చీడలు ఆశించే ప్రమాదముంది. చీడలను పసిగట్టి నివారణ చర్యలు వాడి... సస్యరక్షణ చర్యలు వాడితేనే దిగుబడి వస్తుందని బెల్లంపల్లి కేవీకే శాస్త్రవేత్త డా.శివకృష్ణ వెల్లడించారు.

వరిలో ఇలా..

కంకినల్లి: ఈ పురుగు ఆశిస్తే గొలక నల్లగా మారుతుంది. దీని నివారణకు వర్షం లేని సమయంలో ఎకరాకు ఒక మి.ల స్పైరోమెసిఫెన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచుపురుగు: ఈపురుగు సోకితే పిలకలు చనిపోయి తెల్లకంకులుగా మారతాయి. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లేదా ఫాస్ఫమిడాన్ 2.0 మి.లీ లేదా అసిఫేటు 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


సాగు చేస్తున్న వరి

అగ్గితెగులు: గాలిలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల అగ్గితెగులు ఆశించే ప్రమాదం ఉంది.. దీని నివారణకు 0.6 గ్రా. ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీఐసోప్రోథయోలేన్ లీటరు నీటికి కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

దోమపోటు, సుడిదోమ: గోధుమ వర్ణపు దోమ, తెల్ల మచ్చ దోమ వరిపైరును ఆశించడం వల్ల కర్ర మొదళ్ల దగ్గర చేరి రసం పీలుస్తాయి. దీనివల్ల పైరు సుడులుసుడులుగా ఎండిపోతుంది. పొలంలో నుంచి నీటిని తీసివేసి 1.5ఎసిఫేటు 75 ఎస్‌పీ లీటరు నీటికి వరి పైరు మొదళ్లపై పడేట్లు పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే ఒక ఎకరానికి కార్బోఫ్యూరాన్ 10 జీ గుళికలు 10 కిలోలు లేదా బూప్రొఫెజిన్ 1.6 మి.లీ లీటరు నీటికి కలిపి మొదళ్ల దగ్గర తడిచేలా పిచికారీ చేయాలి.

ఆకుముడత: గొంగళి పురుగు ఆకులు రెండు అంచులు కలిపి లోపలి నుంచే కర్ర ఆకుపచ్చ పదార్థాన్ని తినివేయడం వల్ల ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు ఎసిఫేటు 1.5 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరికామ్లం 2.0 గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ లేదా మోనోక్రోటాపాస్ 1.6 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పత్తిలో సస్యరక్షణ చర్యలు: పత్తి ప్రస్తుతం కాయగట్టి పడే దశలో ఉంది. ఈ దశలో సస్యరక్షణ చర్యలు ఇలా...

రైతేరాజు

రసం పీల్చే పురుగు: ఈ పురుగు లార్వాలు మొగ్గలు, పువ్వులకు చిన్నరంధ్రాలు చేసి కర్రకు నష్టం చేకూరుస్తాయి. దీంతో మొగ్గలు, పువ్వులు రాలిపోతాయి. కాయలు, పిందెలను తింటూ నష్టం కలుగజేస్తాయి. నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే ఇండాక్సాకార్బ్ 1మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేటు 0.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మచ్చల పురుగు: ఈ పురుగు లార్వాలు లేత కొమ్మలను కాయలను తొలచి నష్టం చేస్తాయి. ఇవి ఆశిస్తే కొమ్మ ఎండిపోయి, కాయలు రాలిపోతాయి. పురుగు ఆశించిన భాగాల్లో దీని విసర్జన పదార్థం కన్పిస్తుంది. దీని నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ లేదా థయోడికార్బ్ 1.5 గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సార్వత్రిక చదువు..భవితకు వెలుగు



చెన్నూరు, న్యూస్‌టుడే:

చదువుకోవాలని కొందరికి ఆసక్తి ఉంటుంది. కానీ వివిధ కారణాలు, కుటుంబ ఆర్థిక పరిస్థితులతో పాఠశాల స్థాయిలోనే మధ్యలో ఆపేస్తుంటారు. ఇంకొందరు పదోతరగతి పూర్తయిన తర్వాత ఇంటర్ విద్యకు వెళ్లకుండా మానేస్తుంటారు. మళ్లీ చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారికి తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ సొసైటీ సదవకాశం కల్పిస్తోంది. ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్‌లోనూ ప్రవేశాలు అందుబాటులోకి వచ్చాయి. డిగ్రీ, పీజీలు కూడా చేయొచ్చు. ఏటా వేలాది మంది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశాలు తీసుకుంటూ చదువుపై దృష్టి పెడుతున్నారు. అయితే దీన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ కొలువులు సాధిస్తున్న నేపథ్యంలో కథనం.


దరఖాస్తు ఇలా..

ఓపెన్ పది, ఇంటర్‌లో ఈ విద్యా సంవత్సరం 2024-25లో ప్రవేశాలు పొందడానికి అపరాధ రుసుముతో ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

డిగ్రీ, పీజీకి అవకాశం

ఓపెన్ పది, ఇంటర్ పూర్తి చేసిన అభ్యాసకులు దూరవిద్యావిధానం ద్వారా డిగ్రీ ఆ తరువాత పీజీ చదువొచ్చు. ఓపెన్ ఇంటర్ పూర్తి చేసిన వారు రెగ్యులర్‌గా లేదంటే దూరవిద్యా విధానం ద్వారా డిగ్రీ చదవాలి. డిగ్రీ పూర్తి చేసిన వారు దూరవిద్యావిధానం ద్వారా లేదంటే రెగ్యులర్‌గా పీజీ చదువుకోవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు కాకతీయ, అంబేడ్కర్ విశ్వవిద్యాలయాలు దూర విద్యావిధానం ద్వారా పీజీ చేసే అవకాశం కల్పించాయి.


ఓపెన్ స్కూల్‌కు హాజరైన అభ్యాసకులకు బోధిస్తున్న అధ్యాపకుడు



లక్షెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన చెలిమెల రాజు స్కూల్ అసిస్టెంట్(తెలుగు)గా జిల్లాలో రెండో స్థానం, భాషా(తెలుగు) పండితుడిగా మూడో స్థానంలో ర్యాంకు సాధించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతి వరకు చదువుకొని మానేశాడు. అనంతరం స్వయం ఉపాధి పొందారు. 2008-2011లో దూర విద్యలో డిగ్రీ చదివారు. అనంతరం బీఈడీ, పీజీ పూర్తి చేశారు. గురుకుల పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. డీఎస్సీకి సిద్ధమై మరో ఉద్యోగం సాధించారు. ఆర్థిక పరిస్థితులతో చదువు మధ్యలో మానేసినా నిరాశ చెందకుండా దూరవిద్యావిధానంతో తన లక్ష్యాన్ని సాధించి పలువురికీ ఆదర్శంగా నిలిచారు.

- చెన్నూరు ఓపెన్ పది, ఇంటర్ కేంద్రాల్లో చదువులు పూర్తి చేసిన ఎంతో మంది రెవెన్యూ, ఇతర శాఖల్లో ఉద్యోగాలు సాధించారు.
- ఓపెన్ ఇంటర్ పూర్తి చేసిన కాసిపేట మండలానికి చెందిన ఓ అభ్యాసకుడు 2018లో నీట్‌కు అర్హత సాధించాడు.

రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు

- అశోక్, ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త

ఓపెన్ స్కూల్ విద్యకు రెగ్యులర్‌తో సమాన గుర్తింపు ఉంది. పది పూర్తిచేసిన వారు ఆపై విద్యకు, ఇంటర్ పూర్తి చేసిన వారూ ఉన్నత విద్యకు అర్హులే. ప్రభుత్వ రంగంలో చిరు ఉద్యోగాలు చేసుకునే వారికి పదోన్నతులకు అవకాశం ఉంటుంది. ఓపెన్ ఇంటర్ చదివిన వారికి గత ప్రభుత్వంలో పదోన్నతులు, ఉద్యోగాలు కూడా సాధించారు.

పది పంటలు.. ప్రతి రోజు ఆదాయం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం :


పండించిన పంటతో రైతు పొచ్చన్న, వడ్డాడి, తాంసి

పట్టణానికి దగ్గరలో ఉన్న పల్లె రైతులు రోజు వారీ ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించారు. ఒకటి, రెండు పంటలతో సరిపెట్టుకోకుండా.. కూరగాయలు, పూలు తదితర పంటలు సాగు చేస్తూ ఆదాయం గడిస్తున్నారు. ఇలాంటి రైతుల్లో తాంసి మండలం వడ్డాడికి చెందిన పొచ్చన్న ఒకరు. వడ్డాడిలో కొంత భూమి ఉన్నా.

ఆదర్శం

. రోడ్డు పక్కన పట్టణానికి దగ్గరలో ఉండే పొన్నారిలో ఎకరం భూమి కౌలుకు తీసుకున్నారు. టమాటా, వంకాయ, బెండ, అలచెంత, బబ్బెర, బీరకాయ కూరగాయలతో పాటు ఆకుకూరలు సాగు చేసి ఎప్పటికప్పుడు మార్కెట్‌కు తరలించేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

జిల్లా కేంద్రానికి గ్రామం దగ్గరలో ఉండటం.. రోజు పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడం సులువుగా ఉండటంతో కూరగాయలను సాగు చేసి రోజు ఆదాయం పొందవచ్చని భావించారు. సొంత భూమిలో పత్తి, సోయా సాగు చేసి, కౌలుకు తీసుకున్న భూమిలో ఒక పంట చేతికి రాగానే మరో పంట చేతికి వచ్చేలా కూరగాయలు సాగు చేశారు. ఎక్కువ దిగుబడి వస్తే టోకుగా విక్రయిస్తారు. పది రకాల పంటలు సాగుకు మొత్తంగా ఏడాదిలో రూ.5 లక్షల పెట్టుబడి కాగా, ఖర్చులు పోనూ ఎకరానికి రూ.2 లక్షల చొప్పున 6 లక్షల ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఈ సీజన్‌లో మొన్నటి వరకు టమాటా ధర తక్కువగా ఉండేది.

ఇప్పుడు ఏకంగా కిలో రూ.80కి పైగా ఉంది. పూలు కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఉంది. పలు రకాల పంటల సాగుతో ఒక రకానికి ధర తగ్గినా.. మరో పంటతో ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



రాజశేఖర్,
కీటక శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్
ఫోన్ నెంబరు: 99085 56659

ప్రశ్న : పత్తి పూత దశలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటను ఆశించే పురుగులను నివారించడం ఎలా?

- రాకేశ్, జైనథ్

జవాబు : 5 మి.లీ వేప నూనె(1500 పీపీఎం) లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ప్రశ్న : కంది పంటలో మొక్క ఎదగాలంటే ఏం చేయాలి?

- ఆశన్న, బెల్లూరి

పాల దిగుబడి ఇలా...

మీకు తెలుసా?

ప్రస్తుతం గేదెలు ఎక్కువగా ఈనుతుంటాయి. చూడి గేదెలను సంరక్షణలో జాగ్రత్తలు తీసుకుంటేనే పాల దిగుబడి బాగా వస్తుందని పశువైద్యాధికారి ధన్‌రాజ్ వివరించారు. పచ్చిగడ్డితో బదులు నేపియర్, జొన్న కర్రలు, లవణాలు, సమీకృత దాణా అందజేయాలి. గడ్డి, జొన్న, నేపియర్ విత్తనాలు రాయితీపై పశువుల ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. పాల దిగుబడి కోసం గేదెలకు కాల్షియం బోరో గ్లూకోజ్ ఇంజక్షన్లు వేయించాలి. ముందస్తుగా టీకాలు వేయించి దోమలు లేకుండా చూడాలి. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

సీతాఫలం @ పీచర


చెట్టుపై

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: కాలనుగుణంగా, ప్రకృతి పరంగా లభించే ఫలాల్లో సీతాఫలాన్ని అందరూ ఇష్టపడుతారు. మధురమైన సీతాఫలాలకు లక్ష్మణచాంద మండలం పీచర గ్రామం ప్రసిద్ధి. ఈ గ్రామంలో సీతాఫలం చెట్టులేని తోట ఉండదంటే అతిశయోక్తి కాదు. పీచరలోకి ప్రవేశించే మార్గంలో రహదారికి ఇరువైపులా సీతాఫలం చెట్లు స్వాగతం పలుకుతాయి. తమ పరిధిలోని తోటల్లో, రహదారుల వెంట ఏ ఒక్క రైతు వీటిని నాటలేదు. ప్రకృతి పరంగా మొలిచిన చెట్లను రక్షిస్తుండటంతో ఏపుగా పెరిగి రైతులకు శీతాకాలంలో అదనపు ఆదాయాన్ని ఇస్తున్నాయి. వర్షాకాలం ముగింపు.. సీతాకాలం ప్రారంభంలో స్థానిక రైతులు ఈ చెట్లకు కాపలాగా ఉంటారు. నిత్యం నిర్మల్‌కు తీసుకెళ్లటంతో పాటు, స్థానికంగా విక్రయిస్తుంటారు. నిర్మల్‌లోని ప్రధాన రహదారుల వెంట, మార్కెట్ ప్రాంతంలో గ్రామ మహిళలు విక్రయిస్తుంటారు. చెట్లపై పండిన పండ్లను నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్తుండటంతో ఇక్కడి ఫలానికి అధిక డిమాండ్ ఉంటుంది. ఒక్కో ఫలానికి సైజును బట్టి రూ.15 నుంచి రూ.70 వరకు ధర పలుకుతోంది. గ్రామంలోని దాదాపు పదిహేను కుటుంబాలు పండ్లు వచ్చినన్ని రోజులు విక్రయాలు జరుపుతుంటాయి. తన తోటలోని చెట్ల ద్వారా సుమారు రూ.50 వేల ఆదాయం సమకూరుతుందని స్థానిక రైతు తెలిపారు.


పీచర వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా సీతాఫలం చెట్లు


పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు, క్రీడా సంఘాల సభ్యులు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

అట్టహాసంగా తైక్వాండో జోనల్ స్థాయి పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) తైక్వాండో పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో స్థానిక సెవెన్‌హిల్స్ పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజా, పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని మెరుగైన ఆటతీరుతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ రాణించిన వారిని త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఫణిరాజా తెలిపారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, శిక్షకుడు మండ శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు రోహిత్, రాహుల్, శ్రావణ్, శ్రీజ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు చూసేద్దాం..

తెలంగాణ దర్శినికి ప్రభుత్వం శ్రీకారం

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ : కొత్త ప్రాంతాల్లో పర్యటించాలన్న ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు 'తెలంగాణ దర్శిని'కి శ్రీకారం చుట్టింది. రెండో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తోంది. ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

సెలవుల తర్వాత..

ఎకో టూరిజం, ఆర్ట్, క్రాఫ్ట్, వారసత్వం, సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సెప్టెంబరు 29న జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో దసరా సెలవుల తర్వాత అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇప్పటికే కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు పర్యాటక ప్రాంతాల సందర్శన మొదలైంది. ఇటీవల కళాశాలలో టూరిజం క్లబ్ ఏర్పాటు చేసి స్థానిక త్రిశూల్ పహాడ్‌పై ఉన్న ఆలయ సముదాయాలను సందర్శించారు. త్రిశూల్ పహాడ్‌ను పర్యాటక ప్రదేశంగా మార్చడానికి ఏర్పాటు చేయాల్సిన వసతులపై విద్యార్థులు నమోదు చేసుకున్నారు.


కోసిని రిజర్వాయర్ వద్ద విద్యార్థులకు జాతీయ విపత్తుల రక్షణ దళం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



త్రిశూల్‌పహాడ్‌పై పర్యటనలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

తరగతుల వారీగా వివరాలు

విభాగం	తరగతులు	రోజులు	దూరం	ఒక్కో విద్యార్థికి ఖర్చు(రూ.లలో)
1	2-4	ఒక రోజు	స్థానికం (మండల పరిధి)	300
2	5-8	ఒక రోజు	20-30	800
3	9-ఇంటర్	రెండు రోజులు	50-70	2000
4	డిగ్రీ	నాలుగు రోజులు	రాష్ట్రంలో ఎక్కడైనా	4000

సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం



తెలంగాణ దర్శిని కార్యక్రమం విద్యార్థులకు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం కల్పిస్తుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చారిత్రక ప్రదేశాలు, ఇతర పర్యాటక ప్రదేశాలపై ప్రత్యేక అవగాహన ఏర్పడుతుంది. వారసత్వ సంపదను కాపాడుకోవడంలో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంది.

- వాసాల ప్రభాకర్, మండల విద్యాధికారి, కాగజ్‌నగర్

పర్యాటక రంగ అభివృద్ధికి దోహదం



విద్యార్థుల్లో పర్యాటక రంగంపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ దర్శిని ఎంతగానో ఉపయోగపడనుంది. పర్యాటక రంగంలో వస్తున్న మార్పులు, ఉద్యోగ అవకాశాలను సైతం డిగ్రీ విద్యార్థులకు వివరించి పర్యాటక రంగంలో ఉపాధి పొందేలా ప్రణాళికలు తయారు చేస్తాం.

- లక్ష్మీనరసింహం, వైస్ ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల. కాగజ్‌నగర్

బాసరలో ప్రసాదాల కొరత

మూడు గంటల పాటు భక్తుల నిరీక్షణ

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా సోమవారం బాసరలోని సరస్వతి ఆలయంలో ప్రసాదాల కొరత ఏర్పడింది. బాసర గోదావరి నదిలో దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో సరస్వతి అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దర్శనం అనంతరం భక్తులు ఉదయం 9.30 గంటలకు ప్రసాదాల టిక్కెట్ కొనుక్కుని కౌంటర్‌కు వెళితే నిల్వ లేవు. ప్రసాదం వస్తోందంటూ భక్తులను మూడు గంటల పాటు ఆపారు. విసుగు చెందిన కొందరు టికెట్ డబ్బులు వెనక్కి ఇవ్వాలని అధికారులను నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందని మండిపడ్డారు. తరచూ ఇలాగే జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.. తీరా మధ్యాహ్నం రెండు గంటలకు చిన్న లడ్డూలను కౌంటర్‌కు తీసుకువచ్చారు. అప్పటికే పలువురు భక్తులు ప్రసాదాలు తీసుకోకుండానే వెనుతిరిగారు. ఆదివారం దసరా ఉండటంతో సోమవారం భక్తులు తక్కువగా వస్తారనే అంచనాతో ప్రసాదాల తయారీని నిలిపివేశారు. ఒక్కసారిగా భక్తులు తరలిరావడంతో కొరత ఏర్పడింది. గత సంవత్సరం ఇదే సందర్భంలో సిద్ధం చేసిన ప్రసాదాలు విక్రయం కాక గ్రామం చివరన కాల్చివేశారు. ఆలయానికి రెగ్యులర్ ఈఓ లేకపోవడం, సిబ్బంది కొరతతో పాలనాపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు అంటున్నారు. సమస్యపై 'న్యూస్‌టుడే' ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ విజయరామారావును చరవాణిలో సంప్రదించగా భక్తుల సంఖ్య ఊహించిన దానికి భిన్నంగా ఉండి సమస్య తలెత్తిందని, పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.

స్టేషన్‌లో పోలీసు సిబ్బంది మధ్య గొడవ

సిరికొండ, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ జిల్లాలోని సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు సిబ్బంది మధ్య జరిగిన గొడవ స్థానికంగా విమర్శలకు తావిస్తుంది. ఆదివారం రాత్రి ఇద్దరు సిబ్బంది మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. చుట్టుపక్కల వారు గమనించడంతో వారి తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సోమవారం సీఐ భీమేష్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' సీఐని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

ఉద్యోగుల బరి.. లక్ష్యంపై గురి

రాష్ట్ర, జాతీయస్థాయి హాకీ పోటీల్లో రాణింపు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం:

వీరంతా మూడు పదుల వయసు దాటినవారు. చిన్నప్పుడు ఇష్టంతో ఎంచుకున్న హాకీ ఆటలో మెరుపులు మెరిపించారు. ఇప్పటికీ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఉన్నతంగా చదువుకుని ప్రభుత్వ కొలువులు సాధించారు. తాజాగా హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ రైల్వే నిలయం ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ హాకీ పోటీలకు ఎంపికయ్యారు.

నిత్యం సాధన



సీనియర్ నేషనల్స్ : 1
సీనియర్ రాష్ట్రస్థాయి : 6
యూనివర్సిటీ గేమ్స్ : 2
రాష్ట్రస్థాయి పోటీలు : 30

ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ కాలనీకి చెందిన షేక్ మహమ్మద్ 2000 సంవత్సరంలో హాకీ ఆటకు ఆకర్షితులయ్యారు. నిత్యం ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో సీనియర్ల వద్ద మెలకువలు నేర్చుకున్నారు. రైట్ బ్యాక్ స్థానంలో ఆడుతూ ప్రత్యర్థులు కొట్టే బంతులను గోల్స్ కాకుండా అడ్డగించడంలో ప్రావీణ్యం పొందారు. 2013లో క్రీడా విభాగంలో ఆబ్కారీశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి ఇచ్చోడలో విధులు నిర్వహిస్తున్నారు.

దేశానికి ఆడాలని..



నేరడిగొండ మండలం ఫటఫటితాండ గ్రామానికి చెందిన ఆడే అశోక్‌కుమార్. హాకీలో దేశానికి ఆడాలని లక్ష్యం పెట్టుకున్నారు. గోల్ కీపింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. పలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. 2012లో క్రీడా విభాగంలో పోలీసు ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో స్పెషల్ పార్టీలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర జట్టుకు పలుమార్లు సారథిగా వ్యవహరించి జట్టును ఒంటిచేత్తో గెలిపించారు.

సీనియర్ నేషనల్స్	4
జూనియర్ నేషనల్స్	4
ఆలిండియా పోలీసు క్రీడలు	10
బెంగుళూరు, పూణే, ఖరగ్‌పూర్ లీగ్ పోటీలు	3
రాష్ట్రస్థాయి పోటీలు	51

నిరంతర విద్యార్థి

ఆదిలాబాద్‌లోని కుమ్మరివాడకు చెందిన యెగిడి శేఖర్ 2006 నుంచి సీనియర్లతో కలిసి హాకీ ఆడుతున్నారు. బెంగుళూరులో ఏడాదిపాటు ఎన్ఐఎస్ హాకీ డిప్లొమా కోర్సు పూర్తి చేశారు. 2019లో ఉట్నూరు గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో హాకీ శిక్షకుడిగా ఉద్యోగం సాధించారు. విద్యార్థులను శిక్షణనిస్తూ, సీనియర్స్ విభాగంలో స్వయంగా పోటీల్లో పాల్గొంటున్నారు.



సీనియర్ నేషనల్స్ : 2
కేయూ, ఓయూ గేమ్స్ : 4
పైకా : 1
రాష్ట్రస్థాయి పోటీలు : 34

మైదానమే నేస్తం



సీనియర్ నేషనల్స్ : 5
యూనివర్సిటీ గేమ్స్ : 5
రాష్ట్రస్థాయి : 21
పంచాయత్ యువ క్రీడా ఔర్ ఖేల్ అభియాన్(పైకా) : 1

ఆదిలాబాద్ శాంతినగర్ కాలనీకి చెందిన పెద్దివార్ శ్రీనివాస్ 2004 నుంచి హాకీ ఆడుతున్నారు. సీనియర్ క్రీడాకారుల వద్ద శిక్షణ పొందారు. సమయం దొరికితే మైదానంలో సాధన చేస్తుంటారు. సెంటర్ ఫార్వర్డ్‌లో చురుకుగా కదులుతూ గోల్స్ చేయడంలో దిట్ట. జిల్లా, రాష్ట్ర జట్టుకు సారథిగా వ్యవహరించి పలుమార్లు జట్టును విజయపథంలో నడిపించారు. ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలోని ఖేలో ఇండియా హాకీ కేంద్రంలో రెండేళ్లుగా కోచ్‌గా పని చేస్తున్నారు.

ఆటే శ్వాసగా



సీనియర్ నేషనల్స్ : 1
జూనియర్ నేషనల్స్: 1
యూనివర్సిటీ గేమ్స్ : 4
అండర్-19 ఎస్‌జీఎఫ్ నేషనల్ : 1
రాష్ట్రస్థాయి పోటీలు : 22

ఆదిలాబాద్‌లోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఆత్రం అతుల్ 2003లో హాకీపై మక్కువ పెంచుకుని సీనియర్ క్రీడాకారులతో కలిసి సాధన చేశారు. లెఫ్ట్ బ్యాక్‌లో ఆడుతూ ప్రత్యర్థి జట్టు గోల్స్ చేయకుండా చాకచక్యంగా ఆపడంలో మెరిక. కాకతీయ విశ్వవిద్యాలయం జట్టుకు, అండర్-19 తెలంగాణ జట్టుకు సారథిగా వ్యవహరించారు. 2020 నుంచి నార్నూరులోని ఏకలవ్య ఆదర్శ క్రీడా పాఠశాలలో హాకీ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు.


హాకీ సాధన చేస్తున్న ఉద్యోగులు

మేమున్నాం.. మీకు తోడుగా..
ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 83418 12400
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066
(10 AM TO 1 PM)

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే

? కౌసర్‌నగర్ ఏరియాలో అంతర్గత రోడ్ల వెంబడి పిచ్చిమొక్కలు పెరిగి పాములు తిరుగుతున్నాయి. వీధిదీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.
- కిరణ్‌కుమార్, కౌసర్‌నగర్

✔ పారిశుద్ధ్య సిబ్బందితో పిచ్చిమొక్కలు తొలగిస్తాం. పురపాలిక అభివృద్ధికి నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వీధిదీపాల ఏర్పాటు చర్యలు చేపడతాం.
- అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్

? పట్టణంలోని గాంధీచౌక్ వెనుక వైపు నాలాల్లో పూడిక తీయడం లేదు. దుర్గంధం వస్తోంది. - కిరణ్, కాగజ్‌నగర్

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడికతీత పనులు చేయిస్తాం.
- శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే

? కాగజ్‌నగర్ పట్టణం కౌసర్‌నగర్ ఏరియాలోని ఓ గల్లీలో మురుగు నీటిని రోడ్డుపై వదులుతున్నందున తీవ్ర అపరిశుభ్రత నెలకుంటోంది.
- ఎన్.వేణుగోపాల్ చారి, స్థానికుడు

✔ త్వరలోనే ఆ గల్లీ రోడ్డును పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- అంజయ్య, కమిషనర్, పురపాలికసంఘం, కాగజ్‌నగర్

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ఫిర్యాదు

ఆసిఫాబాద్, రెబ్బెన, న్యూస్‌టుడే : ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఇంటికి వెళ్లి దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. సోమవారం బాధితుడితో కలిసి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గోలేటి పంచాయతీలో మరుగుదొడ్ల నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయని, నిధులు పక్కదారి పట్టాయని విచారణ జరిపించాలని సంఘం తరఫున ఉపేందర్.. కలెక్టర్, ఇతర అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారన్నారు. ఆ పంచాయతీ మాజీ సర్పంచి భర్త, భారాస మండల అధ్యక్షుడు, మరో ఇద్దరు కలిసి ఆదివారం రాత్రి దాడి చేసి బెదిరించినట్లు ఆరోపించారు. ఈమేరకు శ్రీధర్, అతనికి సహకరించిన శ్రీనివాస్, సత్యనారాయణలపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు. సంఘ సభ్యులు శంకర్, చిరంజీవి, మోహన్‌బాబు ఉన్నారు.


ఎస్పీ కార్యాలయం వద్ద ఫిర్యాదు ప్రతితో ఏఐటీయూసీ సభ్యులు

14 మందికి రిమాండ్

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘర్షణలో 14 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం తెలిపారు. ఈఎస్ఐ, ఫ్లైఓవర్ సమీపంలోని పండ్ల దుకాణం (జ్యూస్ సెంటర్) వద్ద జరిగిన గొడవల్లో నిందితులను గుర్తించి రిమాండ్‌కు తరలించామని, మరికొంత మందిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా ముందుగా పోలీసులను సంప్రదించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తించినా, మత సామరస్యానికి భంగం కలిగేలా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దంపతులు వరుణ్‌రాజా-రోషిణి

మావోయిస్టు దంపతుల లొంగుబాటు

బల్లార్ష, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల ఎదుట మావోయిస్టు దంపతులు సోమవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. గడ్చిరోలి జిల్లా ఎస్పీ నీలోత్పాల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాకు చెందిన వరుణ్ రాజా(27), గడ్చిరోలి జిల్లా బామ్రాగడ్‌కు చెందిన రోషిణి(25)లు 2015లో మావోయిస్టు కార్యకలాపాలకు ఆకర్షితుడయ్యాడు. ఈక్రమంలోనే వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు. వారిద్దరిపై గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. అతనిపై రూ.8 లక్షలు, ఆమెపై రూ.2 లక్షల రివార్డు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆత్మసమర్పణ పథకం కింద ఇప్పటివరకు 674 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఎస్పీ వివరించారు.


రోడ్డుపై బైఠాయించిన రైతన్నలు

అన్నదాతల ఆందోళన

కౌటాల, న్యూస్‌టుడే : సక్రమంగా విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ.. కౌటాల సబ్‌స్టేషన్ ఎదుట, రహదారిపై అన్నదాతలు సోమవారం ధర్నా చేపట్టారు. మండలంలోని గుండాయిపేట్, గుడ్లబోరి, మొగఢ్‌దగడ్, రణవెలిల, తుమ్మిడిహేటి గ్రామాల రైతులు మాట్లాడుతూ.. రోజూ రెండు, మూడు గంటలే విద్యుత్తును సరఫరా చేస్తుండటంతో పంటలకు సాగునీరు అందించలేకపోతున్నామని వాపోయారు. పంటలు ఎండిపోయే స్థితికి చేరాయని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


ఇసుక కుప్పలను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

ఇసుక నిల్వలు స్వాధీనం

సిర్పూర్(టి), న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో సోమవారం ఉదయం మాకిడి గ్రామ శివారులో అక్రమ ఇసుక దందా గురించి సమాచారం అందుకున్న భాజపా నాయకులు, కార్యకర్తలు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సుమారు 150-200 ట్రాక్టర్ల లోడ్ల ఇసుక కుప్పలుగా ఉండటంతో సిర్పూర్(టి) తహసీల్దార్‌కు సమాచారమిచ్చారు. ఈమేరకు అధికారులు ఇసుకను సీజ్ చేసినట్లు నాయకులు తెలిపారు. అక్రమ ఇసుక దందా గురించి పూర్తి విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సెక్యూరిటీ అధికారులకు సన్మానం

శ్రీరాంపూర్ గ్రామీణం : శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జక్కారెడ్డి, బదిలీపై వెళ్తున్న అధికారి మల్లికార్జున్‌ను భద్రత సిబ్బంది ఘనంగా సన్మానించారు. సోమవారం సెక్యూరిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ సంస్థ ఆస్తులను రక్షించడంలో సిబ్బంది ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

బాధలతో వచ్చి.. సమస్యలు విన్నవించి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : పట్టా ఇప్పించాలని ఒకరు.. ఉపాధి కల్పించాలని మరొకరు, పింఛన్ మంజూరు చేయించాలని ఇంకొకరు, భూ సమస్యలు పరిష్కరించాలంటూ మరికొందరు.. ఇలా వివిధ మండలాల నుంచి అర్జీదారులు తమ గోడును అధికారుల ముందు వెల్లబోసుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల సందడి కనిపించింది. కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. ఫిర్యాదులపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

★ టీ-హబ్‌లో ఫార్మసిస్టుగా పనిచేసిన కాలానికి వేతనం ఇప్పించాలని జిల్లా కేంద్రానికి చెందిన రాహుల్‌కుమార్ అర్జీ పెట్టుకున్నారు. డీఎస్సీ-2024లో ర్యాంకు వచ్చి ధ్రువపత్రాల పరిశీలన జరిగినా ఉద్యోగం రాలేదని, న్యాయం చేయాలని ఆసిఫాబాద్‌కు చెందిన రాయమల్లు, కార్తి కిరణ్‌లు వినతి పత్రం ఇచ్చారు. జిల్లాలో ప్రైవేటు ఐటీఐ ఏర్పాటు కోసం అనుమతి ఇవ్వాలని కోరుతూ.. మంచిర్యాల జిల్లా ముత్యంపల్లికి చెందిన బోయిని శ్రీనివాస్ దరఖాస్తు చేశారు.


సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లకు వినతిపత్రం అందజేస్తున్న లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌బాబు, తదితరులు


దరఖాస్తు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, చిత్రంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు

అయిదు నెలల నుంచి నష్టపోతున్నా


- సెమి ఉల్లాఖాన్, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పురపాలిక కేంద్రం వద్ద తాత్కాలిక షెడ్డులో ఇదివరకు ఆధార్ కేంద్రం నడిపాను. సరైన వసతి లేకపోవడం, ప్రజలకు ఇబ్బంది కలుగుతుండటంతో అధికారులు కేంద్రాన్ని మరోచోట మార్చాలని పంపించారు. ఎల్లాగౌడ్‌తోట పీహెచ్‌సీ వద్ద గది సిద్ధం చేసుకున్నా. కేంద్రం మార్చేందుకు అనుమతి కోసం అయిదు నెలలుగా తిరుగుతున్నా. అప్పటి నుంచి కేంద్రం మూసి ఉంచడంతో నష్టపోతున్నా. అధికారులు స్పందించి అనుమతి ఇప్పించాలి.

అసైన్డ్ భూమిగా తప్పుగా నమోదు


- పొరిశెట్టి శ్రీహరి, ముంజంపల్లి

బెజ్జూరు మండలం ముంజంపల్లి శివారు సర్వే నం.138/96లో 15.0280 ఎకరాల భూమి ఉంది. ఇది బందోబస్తు పాత పట్టా ఉంది. ధరణిలో మాత్రం అసైన్డ్‌గా నమోదు చేశారు. తప్పు సవరణ కోసం 2022లో మీ-సేవా కేంద్రంలో దరఖాస్తు చేసి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. కలెక్టరేట్‌లోనే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలి.

కాలువ నీరు రాక ఎండుతున్న వరి పంటలు

మేము రెబ్బెన మండలం ఇంద్రానగర్, లక్ష్మీపూర్ గ్రామాలకు చెందిన రైతులం. వట్టివాగు ప్రాజెక్టు డీ-9 కాలువ కింద భూముల్లో వరి సాగు చేస్తున్నాం. జలాశయం నీరు మా చేలకు రావడంలేదు. పొట్టదశకు వచ్చిన పంట ఎండుతోంది. నీటి పారుదలశాఖ అధికారులకు విన్నవించినా స్పందన లేదు. తమ ముందున్న వారు కాలువ గేట్లు తొలగించి నీటిని పొలాల్లోకి మళ్లించుకోవడంతో చివరి వరకు నీరందడం లేదు. గతేడాది నీరందక సుమారు 350 ఎకరాల్లో నష్టపోవాల్సి వచ్చింది.


- కొండగొర్ల శంకర్, మొర్లె నారాయణ, సాజీద్ అలీ అఫ్సార్, లింగయ్య

కాగజ్‌నగర్‌లో 22 దరఖాస్తులు

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 22 దరఖాస్తులు వచ్చినట్లు సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల తెలిపారు. భూవివాదాలపై 7, రేషన్ సమస్యలపై 3, పింఛన్లపై 2, ఇతర సమస్యలపై 10 దరఖాస్తులు వచ్చాయని, పరిశీలించి త్వరితగతిన పరిష్కారం దిశగా కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ.. అసోసియేషన్ అధ్యక్షుడు వెన్న కిశోర్‌బాబు ఆధ్వర్యంలో సభ్యులు వినతిపత్రం అందజేశారు.

లీకేజీతో రోడ్డంతా చిత్తడిమయం!

పట్టణంలోని బాలాజీనగర్ వాటర్ ట్యాంకు సమీపంలో మంచినీటి పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. రోడ్డుపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తరచూ ఇక్కడ లీకేజీలు సర్వసాధారణంగా మారాయని, రోడ్డంతా చిత్తడిగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డు గుండా మార్కెట్, పాఠశాలలకు వెళ్లే వారు అధికంగా ఉంటారు. పురపాలిక అధికారులు స్పందించి లీకేజీ అరికట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్



ధమ్మచక్ర పరివర్తన్ దివస్

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని ఖమానలో సోమవారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో.. ధమ్మచక్ర పరివర్తన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జాడి మనోహర్, బౌద్ధ సమాజ్ ఉపాధ్యక్షుడు తిరుపతి, ఉపాసకులు మిలింద్ కుమార్, కిషన్, మారుతి, శంకర్, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.


ఖమానలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సంఘం నాయకులు

రహదారుల అనుమతులకు ప్రత్యేక కృషి

బెజ్జూరు, న్యూస్‌టుడే: జిల్లాలో అటవీ అనుమతులు లేని కారణంతో పనులు నిలిచిన రహదారులకు అనుమతులు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, పూర్తి చేసేలా కృషి చేస్తామని ఎంపీ గోడం నగేష్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో మాట్లాడారు. నీతి, నిజాయతీగా పనిచేసేది భాజపా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలన అవనీతిమయం అని ఆరోపించారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి బూత్ నుంచి ఒక్కొక్క కార్యకర్త 100-200 మందిని సభ్యత్వం చేయించాలని, మంగళవారం సాయంత్రం వరకు తుది గడువని చెప్పారు. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణాలకు స్థలం, ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ పాత్రికేయులు ఎంపీకి వినతి పత్రం సమర్పించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సుధాకర్‌రావు, నాయకులు బాలకృష్ణ, తిరుపతి, వసీఖాన్, రాకేష్, బాపు, దిలీప్, రాజారాం, కిష్టయ్య పాల్గొన్నారు.


బెజ్జూరులో మాట్లాడుతున్న ఎంపీ నగేష్, చిత్రంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

పెంచికల్‌పేట్: గ్రామస్థాయిలో భాజపాను బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మొర్రిగూడ రోడ్డు, పాఠశాలల సమస్యలు, తదితర సమస్యలపై నాయకులు వారికి వినతి పత్రాలు అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్, నాయకులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యల పరిష్కారంపై..

దహెగాం: ఉమ్మడి జిల్లాలోని పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ గోడం నగేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ వార్షికోత్సవ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రెస్ క్లబ్ వరకు ర్యాలీగా బయలుదేరారు. పాత్రికేయుల పాత్ర గ్రామాల అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన వెంట ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఆర్ఎస్పీ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ రాక.. తప్పని వ్యధ!


ఎడ్ల బండిపై డ్రమ్ముల్లో నీళ్లు నింపుకొంటున్న గ్రామస్థులు

మండలంలోని డోర్‌పల్లి గ్రామ పరిధి కొమ్ముగూడ, రామాయణంపేట్ కాలనీల్లో వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ శివారులోని ఓ ఇంట్లో బోరు ఉండటంతో.. నిత్యం ఎడ్ల బండ్లపై డ్రమ్ములు పెట్టుకుని బారులు తీరుతున్నారు. నీరు రావడం లేదని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి నీరు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, సిర్పూర్ (టి)

ఆ గ్రామాలు.. ఐసీడీఎస్ సేవలకు దూరం!

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ఎంతగానో దోహదపడే ఐసీడీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్) సేవలు.. ఆ గ్రామాలకు దూరమయ్యాయి. మండలంలోని విలేజి నం.6, 13 గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు లేవు. ఇక్కడి గ్రామాల్లో 14 మంది గర్భిణులు, అయిదుగురు బాలింతలు, 14 మంది కిశోర బాలికలున్నారు. సాధారణంగా అంగన్‌వాడీ కేంద్రాలున్న చోట గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సలహాలు, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందజేస్తుంటారు. కానీ ఈ రెండు గ్రామాల్లోని అర్హులకు ఈ సేవలేవి దక్కడం లేదు. ఈ రెండింటికీ కలిపి ఒక్క కేంద్రం లేకపోవడం అధికారుల పట్టింపులేనితనానికి నిదర్శనమనే ఆరోణలు వస్తున్నాయి. కేంద్రాలు మంజూరు చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ప్రాతినిధ్యం చేసినప్పటికీ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మాజీ సర్పంచి సుధీర్‌ఐచ్ ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో ఒప్పంద, పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు చిరంజీవి డిమాండ్ చేశారు. సోమవారం సంఘ సభ్యులు, ఉద్యోగులతో కలిసి డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. ఆరోగ్య కార్డులు జారీ చేయాలని ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలంటూ పలు డిమాండ్లు చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న ఒక రోజు మహాధర్నా ఉంటుందన్నారు. రాందాస్, గణేష్, శ్రేష్మ తదితరులున్నారు.

ఖాదీ మేళా ప్రారంభం

శ్రీరాంపూర్ గ్రామీణం : నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖాదీ మేళాను ఏరియా జీఎం బ.సంజీవరెడ్డి-రాధాకుమారి దంపతులు సోమవారం ప్రారంభించారు. గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, డీజీఎం(పీ) అరవిందరావు, పీఓ కాంతారావు పాల్గొన్నారు.


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష

శ్రీరాంపూర్ గ్రామీణం : శ్రీరాంపూర్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై కార్పొరేట్ జీఎం(ప్రాజెక్టు, ప్రణాళికలు) మనోహర్ సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం బి.సంజీవరెడ్డితో కలసి ఆయన మాట్లాడుతూ.. నిర్దేశిత లక్ష్య సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఓబీ వెలికితీతకు అడ్డంకులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళికల ప్రకారం రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఏరియాకు విచ్చేసిన మనోహర్‌ను ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ప్రాజెక్టు అధికారులు టి.శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, రాముడు, శ్రీధర్, డీజీఎం(పీ) అరవిందరావు, శ్రీధర్‌రావు, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు ప్రారంభం

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: మండలంలోని కమ్మర్గాం గ్రామాన్ని ఎమ్మెల్సీ దండే విఠల్ ఇటీవల సందర్శించారు. గ్రామస్థులు రోడ్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు ఏసీడీపీ నిధులు రూ.10 లక్షలు మంజూరు కాగా.. సోమవారం స్థానిక నాయకులు నందిగాం నుంచి గుండెపల్లి వరకు రహదారికి మరమ్మతులు ప్రారంభించారు. కార్యక్రమంలో రాచకొండ కృష్ణ, శంకర్ గౌడ్, సముద్రాల రాజన్న, రమేష్, చందు, బాపు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దృష్టికి విద్యారంగ సమస్యలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: విద్యారంగంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్సీ కోదండరాం దృష్టికి తీసుకెళ్లినట్లు పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్శ చంద్రశేఖర్ తెలిపారు. హైదరాబాదులోని ఎమ్మెల్సీ నివాసంలో సోమవారం కలిసి విజయదశమి శుభాకాంక్షలతో పాటు జిల్లాలోని విద్యారంగ సమస్యలు విన్నవించామని చెప్పారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు.


ఎమ్మెల్సీ కోదండరామను సత్కరిస్తున్న పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్

జనసేనను బలోపేతం చేద్దాం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జి ఆర్‌కె సాగర్ తెలిపారు. సోమవారం గోదావరిఖనిలో సిర్పూర్ నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో సమస్యలను గుర్తించి ప్రజల మద్దతుతో పోరాటాలు చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా నాయకులు రమేష్, నియోజకవర్గ నాయకులు పోతుల ప్రవీణ్, అల్లూరి సాయి, వినేష్‌రెడ్డి, గణేష్, బాలేష్, దేవయ్య, మనీష్, చెట్టి రాజేష్, సన్నీ, రాజు, ప్రసాద్ తదితరులున్నారు.

ఉచిత నృత్య శిక్షణ ముగిసె

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దసరా సెలవుల్లో మోక్షిత డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నృత్య శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ హాజరై విద్యార్థుల నృత్య ప్రతిభను పరిశీలించారు. విద్యార్థులకు ఉచితంగా నృత్య శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. త్వరలోనే శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. డాన్స్ మాస్టర్ డోంగ్రె సంతోష్ పాల్గొన్నారు.


శోభాబాయిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు

ఆదివాసీ యువత చదువుపై దృష్టిపెట్టండి

కెరమెరి, న్యూస్‌టుడే : చదువుతోనే అన్ని రంగాల్లో రాణించవచ్చని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సోమవారం మండలంలోని చౌపన్‌గూడలో చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఉపాధ్యాయురాలిగా ఎంపికైన పంద్రం శోభాబాయికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. చదువుతో వచ్చే జ్ఞానాన్ని ఎవరూ దొంగిలించలేరన్నారు. ఆదివాసీ యువత చదువుపై దృష్టి సారించాలన్నారు. బోకడగూడలో డీఎస్సీలో మెరిసిన రాఠోడ్ నరేష్, రాఠోడ్ మహేష్, సువర్ణలను సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ నాయక్ ఆధ్వర్యంలో సత్కరించారు. మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరాం, మాజీ వైస్ ఎంపీపీ అబ్దుల్‌కలాం, ఆత్రం బొజ్జిపటేల్, దంబీరావు, జ్ఞానేశ్వర్, జగన్నాథ్‌రావు, కనక ప్రభాకర్, కోవ ఇందిర పాల్గొన్నారు.

27న పద్మశాలి సంఘం ఎన్నికలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఆసిఫాబాద్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఎన్నికలు ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవనంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి చెన్నూరి ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 17, 18 తేదీల్లో నామినేషన్ పత్రాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

దాడికి పాల్పడ్డ ముగ్గురిపై కేసు

రెబ్బెన, న్యూస్‌టుడే: మండలంలోని గోలేటికి చెందిన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్‌పై దాడి చేసి బెదిరించిన ముగ్గురిపై ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. గతంలో గోలేటిలో మరుగుదొడ్ల విషయంపై మాజీ సర్పంచిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, దానిని దృష్టిలో ఉంచుకొని సర్పంచి భర్త భారాస మండలాధ్యక్షుడు పి.శ్రీధర్‌రెడ్డి, అతని అనుచరులు పంబాల శ్రీనివాస్, పరికిపండ్ల సత్యనారాయణ ఉపేందర్‌పై దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

తొలగించకుంటే.. కప్పేస్తాయ్!

మండల కేంద్రం నుంచి దేవాపూర్, అనార్‌పల్లి గ్రామాల మీదుగా వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. రాకపోకల సమయంలో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిచ్చి మొక్కలతో పాటు ముళ్ల పొదలు ఉండటంతో గాయాలపాలైతున్నారు. ఇప్పటికైనా తొలగించకుంటే రహదారిని కప్పేస్తాయని వాపోతున్నారు. సంబంధించిన అధికారులు వెంటనే మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కెరమెరి

